పట్టుదలకు పట్టాభిషేకం

చదువులమ్మ ముద్దుబిడ్డల హర్షాతిరేకాలతో స్థానిక జేఎన్‌టీయూకే ప్రాంగణం ఆనంద నిలయంగా మారిపోయింది. వర్సిటీ స్నాతకోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. కులపతి హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పరిశోధకులకు పీహెచ్‌డీలు ప్రదానం చేసి, స్వర్ణ పతకాలు బహూకరించారు. మాజీ కులపతి బిశ్వభూషణ్ హరిచందన్, ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, వ్యాపారవేత్తలు, మంత్రులు, విద్యార్థుల తల్లిదండ్రులతో వర్సిటీ ప్రాంగణంలో సందడి నెలకొంది. విద్యార్థులు వారి అభిరుచికి, లక్ష్యానికి, ఆశయానికి అనుగుణంగా ఆయా శాస్త్ర విభాగాల్లో ఎంతో కృషి చేసి, అధ్యయనం చేసి పీహెచ్‌డీ పట్టాలు పొందారు. సమాజానికి ఏదో చేయాలనే తపన వారిని ముందుండి నడిపించింది. ప్రతి పట్టా వెనుకా ఒక ఆశయం దాగుంది. ఆ విశేషాలు వారి మాటల్లో..

– బాలాజీచెరువు (కాకినాడ సిటీ)



పరిశోధకురాలికి పట్టా ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు

మైనింగ్ ఇంజినీరింగ్‌లో ప్రగతి సాధిస్తా



నాపేరు జి.విజయ్‌కుమార్. ఏటీసీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో మైనింగ్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. గోల్డ్ మెడల్ రావడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో మెడల్ తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. మైనింగ్ రంగంలో విప్లవాత్మకమైన మార్పు చేసి మరింత ప్రగతి సాధించాలనేదే నా ఆశయం.

– జి.విజయ్‌కుమార్, గోల్డ్ మెడలిస్టు

రైతులకు సేవ చేయాలనేదే ఆశయం



నాపేరు నాపేరు వై.అనిత. కిట్స్‌లో అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. నాకు గోల్డ్ మెడల్ రావడం చాలా సంతోషంగా ఉంది. స్నాతకోత్సవంలో మెడల్ తీసుకోవడం చెప్పలేని అనుభూతి కలిగింది. వ్యవసాయశాఖ ఉన్నతాధికారిగా స్థిరపడి రైతులకు సేవలు అందజేయాలనేదే నా ఆశయం.

– వై.అనిత, గోల్డ్ మెడలిస్టు

జీవిత ఆశయం



నాపేరు డాక్టర్ కె.దుర్గా గంగారావు, ఈసీఈ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేయాలన్నది జీవిత ఆశయం. నా కల నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉంది. జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా తీసుకోవడం నా జీవితంలో మరువలేని రోజు. ప్రొఫెసర్ శ్రీనివాస్ కుమార్ మంచి గైడెన్స్ ఇచ్చారు.

– డాక్టర్ కె.దుర్గా గంగారావు

చమురు నిల్వల పొదుపే లక్ష్యం



నాపేరు జెస్సికా జాకబ్. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో పెట్రోలియం టెక్నాలజీ ఇంజినీరింగ్ కోర్సు చేశాను. గోల్డ్ మెడల్ పొందడం ఆనందంగా ఉంది. చమురు నిల్వలను పొదుపుగా ఎలా వాడాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాను. ముఖ్యంగా పెట్రోలియం ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేయాలనేదే నాఆశయం.

– జెస్సికా జాకబ్, గోల్డ్ మెడలిస్టు

కల సాకారమైంది



నాపేరు కె.గ్రీష్మ. డీవీఆర్ అండ్ డాక్టర్ హెచ్‌ఎస్ మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. గోల్డ్ మెడల్ సంపాదించాలనే నా కల సాకరమైనందుకు చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్ స్వీకరించడం మరిచిపోని అనుభూతి

– కె.గ్రీష్మ, గోల్డ్ మెడలిస్టు

పీహెచ్‌డీ నా చిరకాల వాంఛ



నాపేరు డాక్టర్ ఎం.సౌభాగ్యలక్ష్మి. కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేయాలనేది నా చిరకాల వాంఛ. పీహెచ్‌డీ పట్టా స్నాతకోత్సవంలో తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. విద్యార్థులు కెమిస్ట్రీలో రాణించేలా బోధించి మంచి ఫలితాలు సాధిస్తాను.

– డాక్టర్ ఎం.సౌభాగ్యలక్ష్మి

చాలా ఆనందంగా ఉంది



నాపేరు జి.అప్పలనాయుడు. ఈసీఈలో పీహెచ్‌డీ పట్టా స్వీకరించడం ఆనందంగా ఉంది. ప్రొఫెసర్ డాక్టర్ బీటీ కృష్ణ నేతృత్వంలో పీహెచ్‌డీ చేశాను. ఆయన మంచి సహకారం అందజేశారు. ప్రస్తుతం జేఎన్‌టీయూ విజయనగరంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిస్తున్నా. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే నా ఆశయం

– డాక్టర్.జి.అప్పలనాయుడు

గొప్ప అనుభూతి



నాపేరు డాక్టర్ వి.కల్యాణ్ మనోహర్. స్నాతకోత్సవంలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టా స్వకరించడం నా జీవితంలో గొప్ప అనుభూతి. ప్రొఫెసర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ మంచి గైడెన్స్ ఇచ్చారు. మెకనికల్‌లో విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించమే నా ఆశయం. కొత్త ఆవిష్కరణలు చేసేలా విద్యార్థులకు తోడ్పడతాను.

– డాక్టర్ వి.కల్యాణ్ మనోహర్

క్లుప్తంగా

పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా పోరాడాలి



పొగాకు ఉత్పత్తులను వినియోగించ వద్దని అవగాహన కల్పిస్తున్న ఐడీఏ సభ్యులు

బోట్‌క్లబ్: పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కన్వీనర్ అద్దాల సత్యనారాయణ పేర్కొన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం గాంధీనగర్ పార్కులో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. పార్కులో ధూమపానం వల్ల వచ్చే వ్యాధుల చిత్రాలు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెదురుపాక సతీష్, వైద్యులు రఘురామ్, సువర్ణ, చైతన్య, కల్యాణి పాల్గొన్నారు.

చలో పార్లమెంట్‌కు పోస్టల్ పెన్షనర్ల పిలుపు



పోస్టల్ కార్యాలయం ఎదుట సంతకాలు సేకరిస్తున్న ఉద్యోగులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఎన్‌సీసీపీఏ అల్ ఇండియా పోస్టల్ అర్ఎంఎస్ పెన్షనర్ల సంఘం చలో పార్లమెంట్ పిలుపు మేరకు తపాలా సిబ్బంది సంతకాల సేకరణ చేశారు. చలో పార్లమెంట్ అనంతరం ప్రధాని మోదీకి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేస్తామని సంఘం డివిజనల్ కార్యదర్శి తురగా సూర్యారావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎన్ సాయిరాం మాట్లాడుతూ జూలై 21న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ గ్రూప్ సి డివిజనల్ కార్యదర్శి పి.సాగర్ తదితరులు మద్దతు తెలిపారు. సంయుక్త కార్యదర్శి వి.సుభద్ర, ఉదయ కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ నిత్యం వ్యాయామం చేయడంతో పాటు, పోషక విలువలు గల సమతుల్య ఆహారం తీసుకుంటే మెడ, వెన్నుపూస సమస్యలు రావన్నారు. అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో కూరగాయల మార్కెట్ వద్ద కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రం 41 రోజులుగా కొనసాగుతోందని క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ వెంకట దుర్గావతి తెలిపారు. మల్లేశ్వరి, శ్రీదేవి, లక్ష్మీ సృజన, అంజుమ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోసూరి ఆశయ సాధనకు కృషిచేయాలి



కృష్ణారావు విగ్రహావిష్కరణలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

కాకినాడ: ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడిగా సుదీర్ఘ సేవలందించిన దివంగత కోసూరి కృష్ణారావు కాంస్య విగ్రహాన్ని మంగళవారం సంస్థ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. స్థానిక సూర్యారావుపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో కేసీబీఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంస్థ మాజీ అధ్యక్షుడి సేవలకు గుర్తింపుగా ఈ విగ్రహాన్ని నెలకొల్పారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కోసూరి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఉద్యోగి సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కేసీబీఎస్ ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, మేనేజర్ చీమలకొండ గంగాధరం, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభం, విగ్రహాల ప్రతిష్ఠ



స్వామివార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు, గీసాల శ్రీను తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెంలో కనకదుర్గ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం, సింహవాహనం, ఆలయ శిఖర, నవగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు ఆధ్వర్యంలో అర్చకులు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దేవతా మూర్తులను దర్శనం చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, హితకారిణి సంస్థ డైరెక్టర్ అరుణ, గోపుశెట్టి బాబ్జీ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న దాతలు, ఆలయ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయాన్ని బుధవారం ప్రారంభించారు. గట్టి సత్యనాగేంద్రకుమార్, మంగతాయారు దంపతులు సౌజన్యంతో నిర్మించిన ఈ ఆలయంలో ఉదయం శాస్త్రోక్తకంగా పండితులు పూజలు నిర్వహించి స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ వీరవెంకట సత్యనారాయణ (సత్తిబాబు), ఈఓ ఎం.మురళీవీరభద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామాలయం ఆధునీకరణకు భూమిపూజ



ఆలయం ఆధునీకరణకు భూమి పూజచేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

కరప: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని నీలయ్యతోటవీధి రామాలయం ఆధునీకరణకు బుధవారం భూమిపూజ చేశారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు ఆలయకమిటీ సభ్యులతో కల్సి భూమిపూజ చేశారు. వైస్ ఎంపీపీ, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు భీమేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ. 10 లక్షలు మంజూరుచేశారని, ఆ నిధులతో పాటు భక్తులు ఇచ్చే విరాళాలతో ఆలయాన్ని ఆధునీకరిస్తున్నామన్నారు.

రావూస్ హ్యాండ్లూమ్స్ షోరూమ్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



షోరూమ్ క్యాష్‌కౌంటర్‌ను ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి, ఆయన సతీమణి మహాలక్ష్మి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ ఎల్‌బీ నగర్‌లో రావూస్ హ్యాండ్లూమ్స్ షోరూమ్‌ను బుధవారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభించగా, క్యాష్ కౌంటర్‌ను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉప్పాడ చీరలకు ఎంతో ప్రత్యేకత ఉందని, అటువంటి చీరలు ప్రస్తుతం కాకినాడలో అందుబాటులో ఉండడం ఇక్కడి ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాకినాడ ప్రజలు ఫ్యాషన్‌కు ఎక్కువ ఇష్టపడుతున్నారన్నారు. షోరూమ్‌లో అన్ని రకాల వస్త్రాలు క్వాలిటీతో అందించడం ఆనందదాయకమన్నారు. షోరూమ్ అధినేత కొప్పుల వేంకటేశ్వరరావు మాట్లాడుతూ 30 ఏళ్లగా ఉప్పాడలో తమ షోరూమ్ ద్వారా నాణ్యమైన వేలాది రకాలు వస్త్రాలు తమ కస్టమర్లకు అందిస్తున్నామన్నారు. అదే తరహాలో కాకినాడలో కూడా ఉప్పాడ జాంధానీ, పోచంపల్లి, గద్వాల్, కంచి, ధర్మవరం, బెనారస్ చీరలతోపాటు డ్రెస్ మెటీరియల్స్, లెహంగాస్, బోటిక్‌లకు ఉపయోగపడే ఫ్యాబ్రిక్స్ కూడా మా వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ పాల్గొన్నారు.

జోరుగా క్రికెట్ టోర్నీ



వేళంగి హైస్కూలులో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న లాలిబాబు

కరప: మండలం వేళంగి మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. బుధవారం నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. అండర్–19 విభాగంలో రెండు మ్యాచ్‌లు జరగ్గా మొదటి మ్యాచ్‌లో పాతర్లగడ్డ జట్టుపై కరప జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్‌దిమ్యాచ్‌గా చరణ్‌తేజ్(కరప) నిలిచాడు. రెండో మ్యాచ్‌లో వలసపాకల జట్టు, గురజనాపల్లి జట్టు గెలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జస్వంత్ (వలసపాకల) నిలిచాడు. నో ఏజ్ లిమిట్ విభాగంలో రెండు మ్యాచ్‌లు జరగ్గా, మొదటి మ్యాచ్‌లో పటవల జట్టు, కూరాడ జట్టుపై గెలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కె.మహేష్ (పటవల) నిలిచాడు. రెండో మ్యాచ్‌లో పండలపాక జట్టుపై ఓదూరు జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పి.రాజు (ఓదూరు) నిలిచాడు. మూడో మ్యాచ్‌లో కాజులూరు, ద్రాక్షారామ జట్ల మధ్య జరగాల్సి ఉండగా కాజులూరు జట్టు రాకపోవడంతో ద్రాక్షారామ జట్టుకు వాక్ ఓవర్ ఇచ్చారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు విజేతలకు సచివాలయ ఉద్యోగి షేక్ లాలిబాబు, అజయ్‌వర్మ బహుమతులు అందజేశారు.

అంకిత భావంతోనే దేవుని సేవ

- రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు
- రేస్ ఆఫ్ పీస్ వర్షిప్ సెంటర్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ: దేవుని సేవ కోసం చిన్నగా ప్రారంభించిన రేస్ ఆఫ్ పీస్ వర్షిప్ సెంటర్ 25 ఏళ్లలో ఇంత అభివృద్ధి చెందిందంటే కారణం మూర్తి రాజు శ్రమ, శ్రద్ధ, ఓర్పు, అంకితభావంతో పనిచేస్తేనే సాధ్యమైందని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ రూరల్, నేమాం రోడ్, వనమాలి గెస్ట్ హౌస్‌లో సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు అధ్వర్యంలో రేస్ ఆఫ్ పీస్ వర్షిప్ సెంటర్ 25వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ మన ప్రాంతంలో మూర్తి రాజు ప్రారంభించిన పరిచర్య, సీవైఎఫ్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. మూర్తిరాజు మాట్లాడుతూ అందరి సహకారంతోనే ఈ అభివృద్ధి సాధ్యమైందన్నారు. చిన్నారులు నృత్యాలు, ఆటలతో అలరించాయి. సిస్టర్ ఉషారాణి బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. క్వీన్ విక్టోరియా, రాజ్ స్టీఫెన్ ఆరాధన చేశారు. ఎమ్మెల్సీ పద్మశ్రీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు బ్రదర్ దడాల జాషువాగిరి, సీవైఎఫ్ అడ్వైజర్స్ బిషప్ డి విలియమ్స్, ప్రముఖ న్యాయవాది డేవిడ్ శామ్యూల్, జిల్లా పోలీస్ కార్యాలయం సూపరిండెటెంట్ అనిల్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం

- ఎమ్మెల్సీ సూర్యనారాయణ
- ముగిసిన 12వ జిల్లా స్థాయి శ్రీరామరాజు స్మారక మిని ఒలింపియాడ్ పోటీలు



విజేతలకు పతకాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రంలో క్రీడలకు ప్రోత్సాహం పెరిగిందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం జిల్లా క్రీడా మైదానంలో 12వ శ్రీరామరాజు స్మారక మిని ఒలింపియాడ్ పోటీలు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ముత్తా నవీన్ అధ్యక్షతన ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ మాజీ క్రీడాకారుడు, ఎంఎల్‌సీ సూర్యనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి క్రీడామైదానాలు అభివృద్ధి చేస్తోందని, సీఎం జగన్ క్రీడా ప్రేమికుడని ఆయన అన్నారు. ఇటీవల అమలాపురంలో మంత్రి విశ్వరూప్ సహకారంతో 50 నుంచి 60 లక్షలతో మెగా టోర్నీ నిర్వహించినట్టు తెలిపారు. 13వ మినీ ఒలింపియాడ్ పోటీలు అమలాపురంలో నిర్వహించాలని, అందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. షటిల్ సంఘ చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి మాట్లాడుతూ కాకినాడలో 40 బ్యాడ్మింటన్ కోర్టులను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలతో అభివృద్ధి చేశామని తెలిపారు. రాష్ట్ర చెస్ సంఘ అధ్యక్షుడు వైడీ రామారావు మాట్లాడుతూ జిల్లాకు చెందిన చెస్ క్రీడాకారుడు గ్రహేష్ ఏడేళ్ల నుంచే చెస్ ఆడడం ప్రారంభించి 12 దేశాల్లో వివిధ పోటీల్లో ప్రతిభను కనపరిచాడన్నారు. డీఎస్‌ఏ సీఈఓ షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారనడానికి మాజీ క్రికెట్ కెప్టెన్ ఎంఎస్ ధోని నిదర్శనం అన్నారు. ముందుగా దివంగత జిమ్నాస్టిక్స్ సంఘ కార్యదర్శి శ్రీరామరాజు చిత్ర పటానికి వారు నివాళులు అర్పించారు. క్రీడాకారులు ధాత్రి, పార్వతి, క్రీడలకు ప్రోత్సాహం అందించిన కాంతారావు, మాజీ డీఎస్‌డీఓ ఎంఏ దీన్, కుడిపూడి సూర్యనారాయణ, ఎస్‌ఆర్‌ఏ నాగరాజులను కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. జిల్లాస్థాయిలో కాకినాడ, పిఠాపురం, జగ్గంపేట, రాజోలు తదితర ప్రాంతాల్లో 18 క్రీడాంశాల్లో నిర్వహించిన పోటీలలోని విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మిని ఒలింపియాడ్ పోటీల నిర్వహణ కమిటీ కో–ఆర్డినేటర్ కె.పద్మనాభం, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్‌కుమార్, దివంగత శ్రీరామరాజు కుమారుడు రవిరాజు, హాకీ సంఘ ప్రతినిధి రవిరాజు, తైక్వాండో సంఘ కార్యదర్శి అర్జున్; కోచ్‌లు షరీఫ్, చిన్నారి, సురేష్, బాక్సింగ్ చంద్రశేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ఆర్డీవో రమణ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష ఈ–సర్వేకి సంబంధించి గ్రామస్థాయిలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆర్డీవో బీవీ రమణ తహసీల్దార్లు, సర్వేయర్లను ఆదేశించారు. బుధవారం రూరల్ మండలంలో నిర్వహించే సర్వేపై తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఈ సర్వేకి సంబంధించి మక్కురాళ్లు పంపిణీ వేగవంతం చేయాలన్నారు. తహసీల్దార్ మురార్జీ, డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్, రీ సర్వే డీటీ శ్రీనివాస్ పరిపాలనాధికారి వరహాలయ్య, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా ఎంతో అవసరం

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకోవాలని ఉపాధ్యాయులు వానపల్లి లచ్చబాబు, దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన వేసవి శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా, ధ్యానం అలవర్చుకోవాలన్నారు. హిందీ టీచర్ విమలారాణి మాట్లాడుతూ విద్యార్థులు మేధస్సును వెలికితీసేందుకు వేసవి శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు.

8న ఆలయ భూములకు కౌలు వేలం

పిఠాపురం: మండలంలోని కోలంక వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన 4.71 ఎకరాల భూమిని కౌలుకు ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సీహెచ్ రమణమూర్తి తెలిపారు. కోలంక సర్వే నంబరు 389లో ఉన్న పల్లం భూములకు సంబంధించి వచ్చే నెల 8వ తేదీన ఉదయం 10 గంటలకు ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల రైతులు వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలంలో పాల్గొనే రైతులు తమ ఆధార్ కార్డు తీసుకునరావాలని, పాడుకున్నవారు ఒక సంవతసరం సొమ్ము ముందుగా చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: వార్షిక విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నగరంలోని డెయిరీ ఫారంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ ఈపీ డీసీఎల్ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. దీని వల్ల శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. డైయిరీ ఫారం సెంటర్, దుమ్ములపేట, పల్లంరాజు నగర్, సాంబమూర్తి నగర్, అయోధ్య నగర్, రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్లు, దుమ్ములపేట, రెవెన్యూ కాలనీ, సత్య నగర్, సర్లంధ్ర కాలనీ, ఇందిరా కాలనీ, గణేష్ కాలనీ, జ్యోతుల కాలనీ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

కొత్తపల్లి: సారాను తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రామలింగేశ్వరరావు హెచ్చరించారు. కొత్తపల్లిలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పాముల సంచారంపై ఆందోళన



వికాస కార్యాలయం వద్ద పది అడుగుల పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ శివ

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో ఇటీవలి కాలంలో పాముల సంచారంపై సిబ్బంది, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం అధికారులు, విజ్ఞాపనదారులు, కక్షిదారులు సంచరిస్తున్నా రోజూ ఎవరికో ఒకరికి పాములు కన్పిస్తున్నాయి. బుధవారం వికాస కార్యాలయం ఆవరణలో 10 అడుగుల మేర పాము సంచరించడంతో కొందరు స్నేక్ క్యాచర్ నరాల శివకు తెలియజేశారు. వెంటనే వచ్చి పామును పట్టుకున్నారు. ఇది జెర్రి గొడ్డు అని శివ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలు, గడ్డి పెరగడం వల్ల పాముల సంచారం ఎక్కువైందని పలువురు అంటున్నారు. అధికారులు చొరవ చూపి కలెక్టరేట్ ఆవరణ, పరిసరాలను పరిశుభ్రం చేయాలని, డ్వామా కార్యాలయం, ఆర్అండ్‌బి, వికాస, పౌర సరఫరాల కార్యాలయం, ఆర్అండ్‌బి కార్యాలయం పరిసరాలు పిచ్చిమొక్కలతో గుబురుగా కనిపిస్తున్నాయంటున్నారు. తక్షణం పరిసరాలు పరిశుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాలవెల్లువ సర్వే వేగవంతం చేయాలి

కొత్తపల్లి: గ్రామాల్లో చేపట్టిన పాలవెల్లువ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ అబ్రహం లింకన్ సూచించారు. మండలంలోని వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. పాలవెల్లువ సర్వేపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల నుంచి పాలను అమూల్ డైరీ కొనుగోలు చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. పశువుల సంఖ్యతో పాటు పాల ఉత్పత్తిని కూడా అంచనా వేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఈఓపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.